VEGA JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

RNI NO : APTEL/2016/69464

# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 3

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

శుక్రవారం 29 మే 2026

# ఎన్టీఆర్‌కు భారతరత్న తెలుగువారి ఆకాంక్ష

- తెలుగుజాతి గుండెల్లో శాశ్వతంగా ఎన్టీఆర్
- లోకేష్ ప్రతిపాదించిన మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు మనమే ప్రారంభిద్దాం
- మహానాడు సభలో టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలని మహానాడులో ఏకగ్రీవంగా తీర్మానం










**అమరావతి, కలంకౌంటర్ :** తెలుగుజాతికి వెలుగై నిలిచిన స్వర్గీయ నందమూరి తారక రామారావుకు భారతరత్న ఇవ్వాలనేది ప్రజలందరి డిమాండ్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. దేశరాజకీయాల్లో పెనుమార్పులకు నాంది పలికిన మహోన్నత నాయకుడికి భారతరత్న ఇవ్వాలని ఆయన కోరారు. ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని గురువారం మహానాడు రెండో రోజున ఎన్టీఆర్ కు నివాళి అర్పించే తీర్మానంపై సీఎం చంద్రబాబు ప్రసంగించారు. తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానేత, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు తెలుగు ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయారని సీఎం అన్నారు. సామాన్య ప్రజల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ నిర్ణయాలు తీసుకున్నారని వివరించారు. ప్రజల మనస్సుల్లో ఎన్టీఆర్ చిరస్మరణీయ స్థానం సంపాదించారన్నారు. తెలుగు ప్రజల ఐక్యత కోసం పనిచేసిన మహోన్నత నేత ఎన్టీఆర్ అని... భారత రాజకీయ చరిత్రలో ఆయన సేవలు విశిష్టం...అపూర్వం అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎన్టీఆర్‌కు భారత రత్న ప్రకటించాలని మహానాడు ఏకగ్రీవంగా తీర్మానించింది.

**ఎన్టీఆర్ ఖ్యాతి మరెవరికీ సాధ్యం కాదు..** 'తెలుగు జాతి ఉన్నంత వరకూ తెలుగువారి గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయే వ్యక్తి ఎన్టీఆర్. ఎన్టీఆర్ జయంతి తెలుగువారందరికీ పండుగ రోజు. సాధారణ ఉద్యోగిగా జీవితాన్ని ప్రారంభించి...సినీ జీవితంతో పాటు రాజకీయాల్లోకి వచ్చి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ ఎదిగారు. ఎన్టీఆర్ మళ్లీ పుడితే తప్ప ఆయన క్రమశిక్షణ, ఆయన ఖ్యాతి మరెవరికీ సాధ్యం కాదు. ఆయన ఎక్కడ ఉన్నా తెలుగువారి ఆత్మగౌరవం కోసమే జీవించారు. రైతుబిడ్డ నుంచి సినిమాల్లో శ్రీరామ, శ్రీకృష్ణ పాత్రల వంకూ, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడిగా, ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా ఆయన చరిత్ర సృష్టించారు. ఎన్టీఆర్ పేరు తలుచుకుంటేనే పట్టుదల, ఆత్మవిశ్వాసం వస్తుంది. ఆయన పేరు తలచుకుని సంకల్పం చేస్తే చాలు దేనికీ తిరుగు ఉండదు. దేశ రాజకీయాల్లో ఆయన లాంటి నాయకుడు మరొకరు లేరు. ఆయన మొదట సబ్ రిజిస్ట్రార్‌గా ఉద్యోగంలో చేరి ఆ తర్వాత ఆయన సినిమాల్లోకి వచ్చారు. పార్టీ పెట్టిన 9 నెలల్లోనే ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన స్థాపించిన ప్రాంతీయ పార్టీ అయిన తెలుగుదేశం దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించింది. కేంద్రంలో ప్రభుత్వాల ఏర్పాటులో ముఖ్య పాత్ర పోషించింది' అని సీఎం చంద్రబాబు అన్నారు.

**ప్రజల మనస్సుల్లో ఎన్టీఆర్‌ది చిరస్మరణీయ స్థానం..** "ఎన్టీఆర్ పాలన రైతులకు అండ, మహిళలకు భరోసా, కార్మికులకు అభయం, యువతకు దిక్సూచి అయ్యింది. సమాజమే దేవాలయం...ప్రజలే దేవుళ్లు అనే నినాదాన్ని శాశ్వత విధానంగా ఎన్టీఆర్ మార్చారు. తెలుగుదేశం జెండా ఆడబిడ్డలకు అండ, రైతన్నలకు భరోసా, యువతకు విశ్వాసం. 1983లో రాజకీయాల్లో యువతకు ఎన్టీఆర్ అవకాశాలు కల్పించారు. మహిళలకు ఆస్తి హక్కు కల్పించారు. భవిష్యత్‌లో పార్టీకి సమర్థ నాయకత్వం ఉండేలా భవిష్యత్ కార్యాచరణ చేపడుతున్నాం. జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు లోకేష్ మహానాడు తొలిరోజున ప్రతిపాదించిన 33 శాతం రిజర్వేషన్‌ను మనమే ప్రారంభిద్దాం. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను కల్పించాలని కేంద్రాన్ని మరోమారు కోరదాం." అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

# యువతను నైపుణ్యం కలిగిన మానవ వనరులుగా తీర్చిదిద్దుతాం

- రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి
- వచ్చిన అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలి
- సోషల్ మీడియాలో ఫేక్ కంటెంట్ పట్ల అప్రమత్తంగా ఉండాలి
- టీడీపీ కేంద్ర కార్యాలయంలో జెన్-జీతో మంత్రి లోకేష్ ఆత్మీయ భేటీ
- యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చిన మంత్రి




**మంగళగిరి,కలంకౌంటర్ :** యువత అంకితభావం, సమష్టి కృషి, త్యాగం అలవర్చుకోవాలని టీడీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మహానాడు సందర్భంగా జెన్-జీతో నారా లోకేష్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. యువత అభిప్రాయాలు తెలుసుకున్నారు. జెన్ జీ ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు.

**వచ్చిన అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలి..** రాష్ట్రానికి ఏఐ, క్వాంటం టెక్నాలజీలు వస్తున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా కరిక్యులమ్ లో మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. ఉన్నత విద్యలో ఇప్పటికే పెద్దఎత్తున సంస్కరణలు తీసుకువచ్చాం. పారిశ్రామిక అభివృద్ధి వేగవంతం కోసం ప్రజాప్రభుత్వం క్లస్టర్ బేస్డ్ విధానంతో ముందుకు వెళ్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 22 పారిశ్రామిక క్లస్టర్లను గుర్తించాం. డేటా, ఐటీ, క్వాంటం, రాయలసీమలో ఆటోమోటివ్, కర్నూలులో రెన్యూవబుల్ ఎనర్జీ వంటి క్లస్టర్లు ఏర్పాటుచేస్తున్నాం. ఒకేచోట ప్రధాన పరిశ్రమలతో పాటు అవసరమైన అనుబంధ పరిశ్రమలు, విడిభాగాల తయారీ యూనిట్లను నెలకొల్పడం ద్వారా ఎకోసిస్టమ్ నిర్మిస్తున్నాం. పరిశ్రమలకు అవసరమైన మానవ వనరుల కోసం స్కిల్ డెవలప్ మెంట్ పై ప్రత్యేక దృష్టిసారించాం. రాష్ట్రానికి ఇప్పటివరకు రూ.23 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయి. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్, రిలయన్స్ వంటి సంస్థలు పెద్దఎత్తున పెట్టుబడులు పెడుతున్నాయి. వచ్చిన అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలి. యువతను నైపుణ్యం కలిగిన మానవ వనరులుగా తీర్చిదిద్దుతాం. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానం అని స్పష్టం చేశారు.

**సోషల్ మీడియాలో ఫేక్ కంటెంట్ పట్ల అప్రమత్తంగా ఉండాలి..** సోషల్ మీడియాలో ఫేక్ కంటెంట్ ను ఎక్కువగా వ్యాప్తి చేస్తున్నారు. డీఎస్సీపై ప్రతిపక్ష నేత నిరాధార ఆరోపణలు చేసి బెంగళూరుకు పారిపోయారు. ముఖంపై బురదజల్లి మీరే తుడుచుకోవాలన్నట్లుగా ప్రవర్తించారు. దీనివల్ల లక్షలాది మంది యువత ఆందోళనకు గురవుతారు. వారి భవిష్యత్ ప్రమాదంలో పడుతుంది. మేం పారదర్శకంగా 150 రోజుల్లో డీఎస్సీ ప్రక్రియను పూర్తిచేశాం. సోషల్ మీడియా సమాచారంపై యువత క్రాస్ వెరిఫికేషన్ చేసుకోవాలి.


**యువత అంకితభావం, సమిష్టి కృషి, త్యాగం అలవర్చుకోవాలి..** యువత తమకు నచ్చిన రంగంలో విజయం సాధించాలంటే కలిసికట్టుగా పనిచేయాలి. నేను టీమ్ వర్క్ ను విశ్వసిస్తా. కొన్ని త్యాగాలు కూడా చేయాలి. నేను బాబు గారితో పోటీపడాలంటే బాబు గారి కంటే ఎక్కువ కష్టపడాలి. ఈ రోజు నేను సక్సెస్ అయ్యానంటే కోటిమంది కార్యకర్తలు కారణం. అనుకున్నది సాధించేవరకు విడిచిపెట్టకూడదు. నా పాషన్ ప్రజలకు సేవ చేయడం, ఆంధ్ర రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో నెం.1 చేయడం. పాషన్ అనేది చాలా అవసరం. తర్వాత టీమ్ వర్క్, త్యాగం. కుటుంబ సభ్యులతో నేను ఎక్కువ సమయం గడపలేకపోతున్నాను. నా లక్ష్యం ఒక్కటే బాబు గారితో, మోదీ గారితో పోటీపడాలి. విజయానికి దగ్గరి దారులు లేవు. కష్టపడటం ఒక్కటే మార్గం. ఇతర నగరాల గురించి ఎంతకాలం మాట్లాడుకుంటాం. అమరావతి, విశాఖ, రాయలసీమ గురించి కూడా మాట్లాడుకోవాలి.

**యువత రాజకీయాల్లోకి రావాలి..** యువత రాజకీయాల్లోకి రావాలి. తెలుగుదేశం పార్టీ యువతకు అనేక అవకాశాలు కల్పిస్తోంది. గ్రామ పార్టీ అధ్యక్షుడు పొలిట్ బ్యూరో సభ్యుడు కావాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. యువత పోరాటం అలవర్చుకోవాలి. పాదయాత్రలో నేను ప్రతిరోజూ పోరాడాను. నా స్టూల్ లాక్కున్నారు. మైక్ లాక్కున్నారు. ప్రతిరోజూ పోరాటమే. జీవితం ఎప్పుడూ స్ట్రెయిట్ లైన్ లా ఉండదు. 2019 ఎన్నికల్లో మంగళగిరి నుంచి పోటీ చేసి ఓడిపోయాను. 2024 ఎన్నికల్లో 91వేల మెజార్టీతో విజయం సాధించాను. ఆ రోజు భయపడి ఉంటే.. ఇది సాధ్యమయ్యేది కాదు. కొంతమంది విద్యార్థులు పరీక్షల్లో ఫెయిల్ అయితే ఆత్మహత్యలకు

- 2లో

# ఆక్వా రంగ స్థిరత్వానికి పారదర్శక విధానాలే పరిష్కారం

– ఫీడ్, సీడ్ నాణ్యతపై కఠిన పర్యవేక్షణ : మంత్రి అచ్చెన్నాయుడు



**అమరావతి,కలంకౌంటర్ :** ఆక్వాకల్చర్ రంగం ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో పరిశీలిస్తున్నదని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శ్రింప్ ఫీడ్ ధరల పెరుగుదల, ముడి పదార్థాల కొరత, రైతులపై పెరుగుతున్న వ్యయభారం, ఎగుమతుల సవాళ్లు వంటి అంశాలపై మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో రైతులు, ఫీడ్ తయారీదారులు, ఎగుమతిదారులు, పరిశ్రమ ప్రతినిధుల అభిప్రాయాలను ప్రభుత్వం సమగ్రంగా విన్నదన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న వేసవి పంట సమయంలో ఫీడ్ ధరల పెంపు రైతులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని, అదే సమయంలో ఫీడ్ పరిశ్రమ కూడా ముడి పదార్థాల ధరల పెరుగుదలతో ఒత్తిడిని ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలు దెబ్బతినకుండా, పరిశ్రమ నిలదొక్కుకునేలా సమతుల్య నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఫీడ్, సీడ్ నాణ్యతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, జజుఎ ఆధారిత హ్యాచరీ పర్యవేక్షణ, సీడ్ ట్రేసబిలిటీ, IoT ఆధారిత మానిటరింగ్ వంటి సాంకేతిక చర్యలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. GM సోయా దిగుమతులు, ఫిష్ మీల్ లభ్యత, దిగుమతి లైసెన్సులు, ఎగుమతి పోటీతత్వం వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక పంపనున్నట్లు వెల్లడించారు. ఆక్వా రైతుల సంక్షేమం, ఫీడ్ పరిశ్రమ స్థిరత్వం, ఎగుమతుల వృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తుందని, అన్ని భాగస్వామ్యులు పరస్పర సహకారంతో ముందుకు రావాలని మంత్రి అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్, మత్స్యశాఖ కమిషనర్ రామ శంకర్ నాయక్, అధికారులు, ఆక్వా కల్చర్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ ఆనం వెంకటరమరెడ్డి, AAC సభ్యులు, APSADA సభ్యులు, రైతు సంఘాలు, ఫీడ్ తయారీదారులు, ఎగుమతిదారుల సంఘాలు, పరిశ్రమ ప్రతినిధులు, ఇతర భాగస్వాములు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన వైయస్ జగన్



**తాడేపల్లి,కలంకౌంటర్ :** బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్, రాష్ట్రంలోని ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, ప్రేమ, మానవత్వానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందం, శాంతి, సౌభ్రాతృత్వాన్ని నింపాలని ఆకాంక్షించారు. సమాజంలో పరస్పర గౌరవం, ఐక్యత మరింత బలపడాలని ఈ సందర్భంగా ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తాడేపల్లిలోని ఆయన నివాసంలో ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు వెలంపల్లి శ్రీనివాసరావు, జోగి రమేష్, ఎమ్మెల్సీ మహ్మద్ రుహుల్లా, ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్, విజయవాడ మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పార్టీ అధికార ప్రతినిధి వంగవీటి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# మురుగునీటి కాలువల్లో చెత్త, వ్యర్థాలు వేయకండి

## -కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి.







**తిరుపతి,కలంకౌంటర్ :** ముటుగునీటి కాలువల్లో చెత్త, వ్యర్థాలు వేయకుండా శుభ్రంగా ఉంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి ప్రజలకు సూచించారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా గురువారం ఉదయం చెన్నారెడ్డి కాలనీ, అంబేద్కర్ కాలనీ, ఎన్.జి.ఓ.కాలనీ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. భూగర్భ డ్రైనేజి మరమ్మతులు చేయాలని, పాడై పోయిన రోడ్లను బాగు చేయాలని కోరారు. ముటుగునీటి కాలువల్లో చెత్తచెదారం వేయడం వలన చెత్త పేరుకుపోయి మురుగునీరు రోడ్లపైకి వస్తున్నాయని తెలిపారు. అలాగే ఎక్కడపడితే అక్కడ చెత్త కవర్లలో కట్టి పడేస్తున్నారని తెలిపారు. దీని వలన నగరంలో అపరిశుభ్రత ఎక్కువవుతోందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తడి, పొడి చెత్త వేరు చేసి మున్సిపల్ వాహనం వచ్చినప్పుడు ఇవ్వాలని కమిషనర్ కోరారు. ఇలా చేయడం వలన నగరం శుభ్రంగా ఉండడమే కాకుండా రోగాలు వచ్చే అవకాశం తగ్గుతుందని తెలిపారు. చెత్తను వేరు చేసి మునిసిపల్ సిబ్బందికి ఇచ్చి నగర శుభ్రతకు సహకరించాలని పిలుపునిచ్చారు. నగరంలో పాడై పోయిన అంతర్గత రోడ్లను మరమ్మత్తులు చేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, డీ.ఈ.లు రమణ, శిల్ప, శానిటేషన్ సూపర్వైజర్ చెంచయ్య మరియు సిబ్బంది పాల్గొన్నారు.


# విద్యుత్ శాఖ ఘోర వైఫల్యం

## -జిల్లా వినియోగదారుల రక్షణ మండలి ప్రతినిధి కర్లపాటి



**జగ్గయ్యపేట,కలంకౌంటర్ :** జగ్గయ్యపేట అర్బన్ , రూరల్ పరిధిలో షుమారు 24 గంటలపాటు తలెత్తిన సుదీర్ఘ విద్యుత్ కోతపై జిల్లా వినియోగదారుల రక్షణ మండలి ప్రతినిధి, రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య (క్యాప్కో) ఉపాధ్యక్షులు కర్లపాటి ఒక ప్రకటనలో తీవ్ర ఆక్షేపణ వ్యక్తం చేశారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయలేకపోవడం విద్యుత్ శాఖ సేవలందించడంలో పూర్తిగా విఫలమైంది అనడానికి నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి మచ్చ తెచ్చే విధంగా స్థానిక అధికారుల పనితీరు ఉందని ఆక్షేపించారు. ముఖ్యంగా, ఇంత పెద్ద ఎత్తున విద్యుత్ నిలిచిపోయినప్పుడు స్థానిక వినియోగదారులను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత ఉన్న అసిస్టెంట్ ఇంజనీర్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు తమ బాధ్యతను పూర్తిగా విస్మరించారని ఆయన ధ్వజమెత్తారు. లోకల్ వాట్సాప్ గ్రూపుల్లో గానీ, ఇతర మాధ్యమాల్లో గానీ అసలు విద్యుత్ ఎప్పుడు వస్తుంది? సమస్య ఎక్కడ వచ్చింది? అనే విషయాలపై ఒక చిన్న అధికారిక బులిటెన్ కూడా విడుదల చేసి ప్రజలకు సమాచారం ఇవ్వడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. “వినియోగదారుల రక్షణ చట్టం ప్రకారం నాణ్యమైన సేవలను అందించకపోవడం తీవ్రమైన నేరమన్నారు. విద్యుత్ శాఖ ప్రజల నుండి సకాలంలో బిల్లులు వసూలు చేయడంలో చూపిస్తున్న శ్రద్ధ, సేవలందించడంలో చూపించడం లేదన్నారు. తీవ్రమైన ఎండలకు తోడు దాదాపు 24 గంటల పాటు కరెంట్ లేకపోవడంతో చంటిపిల్లలు, వృద్ధులు, మరియు అనారోగ్యంతో బాధపడుతున్న రోగులు తీవ్ర నరకయాతన అనుభవించారని.” ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గాలివానలు వస్తాయని తెలిసినా ముందస్తు చర్యలు తీసుకోకపోగా, సమస్య వచ్చాక పునరుద్ధరణలో మరియు ప్రజలకు సమాధానం చెప్పడంలో ఘోరంగా విఫలమైన జగ్గయ్యపేట అర్బన్, రూరల్ విద్యుత్ అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు లేఖ వ్రాసినట్లు తెలిపారు.

# యువతను నైపుణ్యం కలిగిన మానవ వనరులుగా తీర్చిదిద్దుతాం



(మొదటిపేజీ తరువాయి)
పాల్పడుతున్నారు. ఇది సరికాదు. ఒక్క పరీక్ష మీ జీవితాన్ని నిర్ణయించలేదనే విషయాన్ని గ్రహించాలి. విద్యార్థులకు అన్ని విధాలా అండగా నిలుస్తాం.

**వంవిశాళలకుం మద్దతుగా నిలవాలి..**

మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అంతా కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. మహిళా సాధికారత ప్రతి ఇంటి నుంచి మొదలవ్వాలి. మా ఇంట్లో మా అమ్మ, బ్రాహ్మణి ఈ విషయంలో స్ఫూర్తిగా నిలిచారు. యువతకు ఉద్యోగాల కల్పనే ఏకైక అజెండాగా పనిచేస్తున్నామని, రాష్ట్రానికి రాయల్ ఎన్ ఫీల్డ్ ఎంత ముఖ్యమో.. పచ్చళ్లు పెట్టే కంపెనీ కూడా అంతే ముఖ్యమని, ఎంఎస్ఎంఈల వల్ల ఎక్కువ ఉద్యోగాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కేఎల్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ నాలుగో ఏడాది చదువుతున్న గుంటూరుకు చెందిన వేమూరి సాత్విక్, విజయవాడ ఎస్ఆర్ఆర్ కాలేజీలో డిగ్రీ పూర్తిచేసిన చరణ్ యాదవ్, కేఎల్ యూలో ఇంజనీరింగ్ పూర్తిచేసిన విజయవాడకు చెందిన సత్యసాయి పవన్ కుమార్, అమరావతి ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఇంటిగ్రేటెడ్ బయోలజీలో మూడో ఏడాది విద్యనభ్యసిస్తున్న ఖ్యాతి వర్ధిని పాల్గొన్నారు.

# మహానాడులో రాజకీయ తీర్మానంపై టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగం



**అమరావతి,కలంకౌంటర్ :** యుద్ధ పరిస్థితుల కారణంగా ఈసారి వర్చువల్‌గా నిర్వహించిన మహానాడు విజయవంతమైంది. వంర్చువల్ మహానాడు అదరగొట్టింది. అత్యద్భుతంగా మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించాం నా రాజకీయ జీవితంలో హైబ్రిడ్ విధానంలో ఈ మహానాడు పెద్ద ప్రయోగం. రాష్ట్ర వ్యాప్తంగా 1,875 క్లస్టర్లతో పాటు 12 దేశాల నుంచి కార్యకర్తలు, నేతలు హాజరయ్యారు. ఈ రెండు రోజుల మహానాడులో ఏకంగా 16.78 లక్షల మంది హాజరుకావటం ఓ రికార్డు రికార్డులు సృష్టించడం, వాటిని తిరగరాయడం టీడీపీకి మాత్రమే సాధ్యం మహానాడును గ్రాండ్ సక్సెస్ చేసిన అందరికీ అభినందనలు, ధన్యవాదాలు కార్యకర్తే అధినేత అనే నినాదాన్ని ఆచరిస్తూ ఈ మహానాడులో వారికి భాగస్వామ్యం కల్పించాం. ఆకాశమే హద్దుగా పార్టీలో కార్యకర్తలు ఎదిగేందుకు అవకాశాలు కల్పించాం. నేతలు, కార్యకర్తలను చూసి నేను కూడా పోటీ పడే పరిస్థితి వచ్చింది. శాశ్వతంగా పార్టీని మోసింది, మోసేది, మోయబోయేది కార్యకర్తలే. వారందరికీ పాదాభివందనం 48 డిగ్రీల తీవ్రస్థాయి ఉష్ణోగ్రతలు, ఎండలు ఉన్నా 1,875 క్లస్టర్ల నుంచి ఈ హైబ్రిడ్ విధానంలో మహానాడుకు హాజరై విజయం చేకూర్చారు కార్యకర్తల సంక్షేమం కోసం రూ.160 కోట్ల రూపాయల మేర ఖర్చు చేశాం నాపై కార్యకర్తలు, ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తున్నాను అందుకే 2047 స్వర్ణాంధ్ర విజన్ తయారు చేసి ఆ దిశగా ముందుకు వెళ్తున్నాను. తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు నేను ఎప్పుడూ రుణపడి ఉంటాను కార్యకర్తల బిడ్డలకు విద్య, సాధికారత, నైపుణ్యం లాంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాం సోషల్ రీ ఇంజనీరింగ్ ద్వారా విస్తృత అవకాశాలు కల్పిస్తున్నాం, బూత్ కమిటీలు, యూనిట్లు క్లస్టర్ల వరకూ అందరికీ న్యాయం చేస్తున్నాం ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్మెంట్ మా లక్ష్యం. నీతి నిజాయితీగా కార్యకర్తలు ఆర్థికంగా ఎదిగేలా నేను బాధ్యత తీసుకుంటాను. ప్రజల కోసం పనిచేసే కార్యకర్తల కోసం నేతలు కూడా పనిచేయాలని పిలుపునిస్తున్నాను పార్టీ కోసం, జెండా కోసం నేతలు, కార్యకర్తలు తమ ఆస్తులు అమ్ముకున్నారు. మెడపై కత్తి పెట్టినా జై చంద్రబాబు, జై తెలుగుదేశం అంటూ ప్రాణం వదిలిన కార్యకర్తలే నాకు శిరోధార్యం

# మహానాడు తెలుగుప్రజలకు మహా పండుగ - హోం మంత్రి వంగలపూడి అనిత



**మంగళగిరి,కలంకౌంటర్ :** ఒక మహానుభావుడి రూపకర్త, ఇంకొక్క విజనరీ నాయకుడు కార్యదక్షత, ఇంకొక్క నాయకుడి భవిష్యత్తు ప్రణాళిక.. వీళ్ల ముగ్గురిని నడిపించి.. నడిపిస్తున్న పార్టీ కోసం ప్రాణ త్యాగానికి అయిన సిద్ధపడిన కార్యకర్త.. ఇవ్వన్నీ కలిపిన తెలుగుజాతి గర్వపడే తెలుగుదేశం పార్టీ. తెలుగుదేశంపార్టీ ఏటా జరుపుకునే ఈ ‘మహానాడు’ నిజంగా ఒక పండుగ, జాతర అనే చెప్పాలి. ఈ మహానాడు అనేది రాజకీయ సభ కాదు.. బలప్రదర్శన కాదు.. తెలుగు జాతి కోసం పెట్టిన పార్టీకి దిశానిర్దేశం ఇచ్చుకుని, భవిష్యత్తు ప్రణాళికలను ఏవిధంగా ముందుకు తీసుకువెళ్లడాలనే చెప్పేందుకు ఉపయోగపడే ఒక సభ. తెలుగుజాతి ఉన్నంతవరకు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే యుగపురుషుడు అన్న ఎన్టీఆర్ . యువగళం అధినేత, ఎంతోమంది యువకుల గళంగా నిలబడిన నారా లోకేష్ కి ప్రత్యేక ధన్యవాదాలు. ఈ మహానాడు వేదికగా రాజకీయ తీర్మానాన్ని బలపరిచే అవకాశం సామాన్య కార్యకర్తను అయిన నాకు అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు. ఈ మహానాడును మహిళలకు అంకితం చేసిన విజనరీ నాయకుడు నారా చంద్రబాబు నాయుడు కి తెలుగు మహిళలందరి తరపున ధన్యవాదాలు. నాడు అన్న ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పటి నుంచే మహిళలు ప్రాధాన్యతనిస్తూ వచ్చారు. నేడు దేశంలో ఎక్కడ లేని విధంగా చట్టసభల్లో మహిళలు 33 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీది. ప్రతిపక్షాలు కూడా తెలుగుదేశం పార్టీ వేసిన బాటలో వచ్చి వారి సత్తా ఏంటో నిరూపించుకోవాలి. ఈ రాష్ట్రంలో ప్రజల సంక్షేమం కోసం పని చేసి.. ప్రజలకు సంక్షేమం అందజేసిన పార్టీ ఏదైనా ఉందంటే అది తెలుగుదేశం పార్టీ మాత్రమే. ఈ 44 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో చంద్రబాబు నాయుడు ఎన్నో అవమానాలు, అటుపోట్లను తట్టుకుని నిలబడ్డారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అంశాలను తీసుకుంటే ఎన్నో సినిమాలు తీయొచ్చు. 2014లో రాష్ట్ర విభజన తరువాత నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం అనుభవం కలిగిన నాయకుడు కావాలని రాష్ట్ర ప్రజలు చంద్రబాబు నాయుడు కి విజయాన్ని అందించాడు. ఎన్నో ఇబ్బందులు ఉన్నప్పటికి అన్నిటిని అధిగమించి మన రాష్ట్రానికి అమరావతి నిర్మాణ పనులు శరవేగంగా నడుస్తున్నాయి. పోలవరం పనులను కూడా పరుగులు పెట్టించారు. అ రోజు రూ.200 ఉన్న పెన్షన్ ను రూ.2 వేలకు పెంచిన ఘనత మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దే. అ రోజు నుంచి చంద్రబాబు నాయుడు గారు ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారు. 2019 ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు గారి ఓటమికి గురైన తరువాత రాష్ట్రంలో విధ్వంసాక పాలన మొదలైంది. ప్రజావేదిక కూల్చివేతతో మొదలైన పాలన ఐదేళ్లు అలానే కొనసాగింది. అమరావతే రాజధానిగా ఉండాలని మహిళలు బయటకి వస్తే బుటు కాళ్లతో తన్నించాడు. యువనేత నారా లోకేష్ “యువగళం” పాదయాత్ర మొదలుపెట్టినప్పుడు అధికార మదంతో ఎన్నో ఇబ్బందులకు గురి చేశారు. అనాడు నారా లోకేష్ ని యువగళం కోసం పంపించిన నారా భువనమ్మకి నిజంగా చేతులెత్తి దండం పెట్టాలి. ఆయనకు అధికారంలో కొత్తేమి కాదు.. తాత సీఎం, తండ్రి సీఎం, ఆయనే మంత్రిగా చేశారు.. అయిన కూడా రాష్ట్ర యువత కోసం ముందుకు వచ్చారు. రోజుకు ఒక్కసారి రెడ్ బుక్ గురించి మాట్లాడుతున్న వాళ్లకి లాగా గొడళ్లు చేతుల్లో పెట్టి బయటకు పంపించే పార్టీ మాది కాదు. నా చేతులు రాజ్యాంగం ఉంది.. దానికి అనుగుణంగానే ముందుకు సాగుతానని చెప్పిన నాయకుడు మా తెలుగుదేశం పార్టీ యువనేత. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా... అధికారం పోయిన తరువాత ఒకలా ఉంటుంది గొడ్డలి పార్టీలో. దళితుడిని చంపేసి డోర్ డెలివరీ చేసిన మనిషిని పక్కన పెట్టుకుని తరువాత మండలికి పంపిన నీచపు ఘనత గొడ్డలి పార్టీది. కానీ, మా నాయకుడు పీ4 విధానంలో బంగారు కుటుంబాలను తయారు చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నాడు. అధికారం ఉన్న.. లేకపోయినా కూడా నేను పేదల పక్షాన నిలబడి పోరాటం చేస్తానని చెప్పిన నాయకుడు మా నారా చంద్రబాబు నాయుడు గారు. రానున్న 15 ఏళ్లు కాదు.. 20 ఏళ్లు ఇదే ప్రభుత్వం కొనసాగితే.. 2047 నాటికి దేశంలోనే కాదు.. ప్రపంచంలోనే మొట్టమొదటి స్థానంలో మన ఆంధ్రప్రదేశ్ నిలబడుతుంది... రాసిపెట్టుకోండి..

# క్షేత్రస్థాయిలో పోరాడినట్టే సోషల్ మీడియాలోనూ పోరాడాలి: ‘మహానాడు’లో రామ్మోహన్ నాయుడు



**మంగళగిరి,కలంకౌంటర్ :** క్షేత్రస్థాయిలో పార్టీ కోసం ఎంతగా శ్రమిస్తున్నామో, అదే స్థాయిలో సోషల్ మీడియాలో కూడా కష్టపడాలని తెలుగుదేశం పార్టీ శ్రేణులకు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయి పోరాటంతో పాటు, ఆన్‌లైన్‌లో కూడా పార్టీ సిద్ధాంతాలను, ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. గురువారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న మహానాడు-2026 రెండో రోజు కార్యక్రమంలో ఆయన రాజకీయ తీర్మానాన్ని ప్రవేశపెట్టి, సుదీర్ఘంగా ప్రసంగించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, 1982లో ఎన్టీఆర్ తెలుగువారి ఆత్మగౌరవం కోసం టీడీపీని స్థాపించి దేశ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించారని గుర్తుచేశారు. పార్టీ పెట్టిన 9 నెలల్లోనే కాంగ్రెస్‌ను గద్దె దించి అధికారంలోకి వచ్చిన ఘనత టీడీపీదని అన్నారు. “సమాజమే దేవాలయం -- ప్రజలే దేవుళ్లు” అనే ఎన్టీఆర్ సిద్ధాంతాన్ని చంద్రబాబు తన పాలనలో నిజం చేసి చూపిస్తున్నారని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించి, యువతను ప్రోత్సహించిన పార్టీ టీడీపీ అని తెలిపారు. పార్టీ మూడు తరాల నాయకత్వం గురించి ఆయన ఆసక్తికరంగా వివరించారు. ఎన్టీఆర్ తెలుగువారికి ఆత్మగౌరవాన్ని నేర్పితే, చంద్రబాబు “విజన్” అనే పదానికి అర్థం చెప్పి రాష్ట్రానికి ఆత్మవిశ్వాసాన్ని పెంచారని అన్నారు. ఇక నారా లోకేష్, “ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్” నుంచి “స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్” స్థాయికి రాష్ట్రాన్ని తీసుకెళ్లి కేవలం రెండేళ్లలో రూ. 24 లక్షల కోట్ల పెట్టుబడులకు శ్రీకారం చుట్టారని ప్రశంసించారు. ఎన్టీఆర్ ఆత్మగౌరవం అయితే, చంద్రబాబు ఆత్మవిశ్వాసం పెంచారని, ఇప్పుడు లోకేష్ మనో ధైర్యాన్ని నింపుతున్నారని అభివర్ణించారు. తమ పార్టీ మూడు తరాలుగా మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, డ్వాక్రా సంఘాలు, 33 శాతం రిజర్వేషన్లు కల్పించి వారి ఉన్నతికి పాటుపడితే, ప్రతిపక్ష పార్టీ మాత్రం మూడు తరాలుగా వేట కొడవళ్లు, కత్తులు, గొడ్డళ్ల సంస్కృతిని ప్రోత్సహించిందని ఆయన విమర్శించారు. గత 44 ఏళ్లుగా ఎన్నో సంక్షోభాలను ఎదుర్కొని టీడీపీ నిలబడిందని, ఈసారి రాజకీయ తీర్మానంలో “సంకల్పం, కర్తవ్యం” అనే రెండు అంశాలు కీలకమని అన్నారు. రాష్ట్రానికి సుస్థిరమైన పరిపాలన అందించాల్సిన బాధ్యత, కర్తవ్యం తెలుగుదేశం పార్టీపై ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ మహత్తర కార్యక్రమానికి తరలివచ్చిన 15 లక్షల మంది కార్యకర్తలకు ఆయన అభినందనలు తెలిపారు.

# అంగరంగ వైభవంగా జరిగిన మహానాడు

- ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే ఇంటూరి
- ఎంపీ వేమిరెడ్డి తో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే







**కందుకూరు,కలంకౌంటర్ :** తెలుగుదేశం పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన డిజిటల్ మహానాడు కార్యక్రమం కందుకూరు నియోజకవర్గం లో అటహాసంగా, అంగరంగ వైభవంగా జరిగింది. బుధవారం, గురువారం రెండు రోజులు కార్యకర్తలు ఉత్సాహంగా ఉల్లాహంగా ఎండను సైతం లెక్కచేయకుండా మహానాడు కార్యక్రమంలో పాల్గొని తమ అభిమానాన్ని చాటుకున్నారు. బుధవారం ఉదయం మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా కందుకూరు పట్టణంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, నియోజకవర్గ పరిశీలకు రాలు మట్టం శ్రావణి రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నియోజకవర్గంలోని ఉలవపాడు మండలంలో ఏర్పాటు చేసిన మహానాడు కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. అనంతరం కందుకూరు ఆరవ క్లస్టర్ నందు ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోనే కందుకూరు నియోజకవర్గం మహానాడు నిర్వాహణలో గుర్తింపు రావడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. మహానాడు నిర్వాణలో కష్టపడి పనిచేసిన క్లస్టర్ నాయకులను అభినందించారు. ఇదే ఉత్సాహంతో స్థానిక ఎన్నికల్లో కష్టపడి పని చేసి 100% విజయం సాధించాలని అన్నారు. మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటరి నాగేశ్వరరావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్‌ను గుర్తుచేసుకుంటూ మోత్కుపల్లి భావోద్వేగం..!

**మంగళగిరి,కలంకౌంటర్ :** ఎన్టీఆర్ లాంటి మనసున్న నాయకుడిని మళ్లీ చూడలేం.. డబ్బు కోసం ఎగబడేవాడు నాయకుడు కాదు. రూపాయి లేకున్నా.. ఎన్టీఆర్ దయవల్లే ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచా. ఇప్పుడున్న నేతలందరి ఆరాటమంతా డబ్బు, సీటు కోసమే. ఎన్టీఆర్ ఆశీస్సులతో మరో ఉద్యమం తీసుకువస్తా.. పేదలు, అణగారిన వర్గాల పక్షాన పోరాడుతా. : మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు

# ‘మహానాడు’లో వైసీపీపై ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ ఫైర్..!

**మంగళగిరి,కలంకౌంటర్ :** “‘గొడ్డలి పార్టీ’ ఐదేళ్లు రాష్ట్రంలో అరాచక పాలన సాగించింది” అంటూ తీవ్ర విమర్శలు. “ప్రశ్నిస్తే ప్రాణాలు తీసే సంస్కృతిని వైసీపీ తీసుకొచ్చింది” అంటూ ఆరోపణలు.. ‘దిశ’ చట్టంపై గత ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టించిందన్న అనురాధ. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ‘శక్తి’ టీమ్స్ సమర్థవంతంగా పనిచేస్తున్నాయని వ్యాఖ్య. పోలవరం, తిరుమల, శ్రీశైలంపై ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ పిలుపు.

# ఆంధ్రప్రదేశ్‌కు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు

## : ‘మహానాడు’లో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**మంగళగిరి,కలంకౌంటర్ :** 24 నెలల్లో రూ.24 లక్షల కోట్ల పెట్టుబడులతో, 24 లక్షల మందికి ఉపాధి లభించేలా చేసేందుకు కర్త, కర్మ, క్రియ చంద్రబాబు. రాజధాని అమరావతిని శరేగంతో ముందుకు తీసుకెళ్తున్నాం.. పోలవరం ప్రాజెక్టును గాడిలో పెట్టాం. గత ప్రభుత్వ హయాంలో ఒక్క పరిశ్రమను కూడా తీసుకురాకపోగా.. ఉన్న పరిశ్రమలను రాష్ట్రం నుంచి వెళ్లగొట్టేలా చేశారు.

# ఐదు కోట్ల ఆంధ్రుల కల.. అమరావతి : కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

**మంగళగిరి,కలంకౌంటర్ :** 2024 ఎన్నికలు ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును మార్చేశాయని ‘మహానాడు’ వేదికగా కేంద్ర మంత్రి పెమ్మసాని వ్యాఖ్య. అమరావతి నిర్మాణానికి కేంద్రం రూ.15 వేల కోట్ల మద్దతు ప్రకటించిందని.. 2027 నాటికి పోలవరం పూర్తిచేసి, తెలుగు జాతికి అంకితం చేస్తామని కేంద్ర మంత్రి పెమ్మసాని స్పష్టం. విశాఖ ఉక్కుకు రూ.11,400 కోట్ల రివైవల్ ప్యాకేజీతో, కేంద్రం మళ్లీ జీవం పోసిందన్న కేంద్ర మంత్రి పెమ్మసాని. ‘గూగుల్ ఏఐ హబ్, గ్రీన్ హైడ్రోజన్, బీపీసీఎల్, ఆర్సెలార్ మిత్తల్’ వంటి భారీ పెట్టుబడులు ఏపీకి వస్తున్నాయని కేంద్ర మంత్రి పెమ్మసాని వ్యాఖ్య. “ప్రపంచ దిగ్గజాలు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నాయంటే అది సీఎం చంద్రబాబు నాయకత్వంపై ఉన్న నమ్మకం” అంటూ కేంద్ర మంత్రి పెమ్మసాని వ్యాఖ్య.

## ఆరోగ్యం శీర్షిక

# క్రమశిక్షణ పేరుతో పిల్లల మనసుల్లో పెరుగుతున్న భయం



ఈ కాలంలో ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలు జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలని కోరుకుంటున్నారు. మంచి విద్య, మంచి నడవడి, సమాజంలో గౌరవం, స్థిరమైన భవిష్యత్తు --- ఇవన్నీ తమ పిల్లలకు రావాలని ఆశపడుతున్నారు. ఆ ఆశ తప్పు కాదు. కానీ ఆ ఆశల మధ్య చాలాసార్లు మరచిపోతున్న ఒక ముఖ్యమైన విషయం ఉంది --- పిల్లల మనసు. పిల్లల భవిష్యత్తు బాగుండాలని కోరుకుంటూ, చాలామంది తల్లిదండ్రులు "క్రమశిక్షణ" అనే పేరుతో కఠినత్వాన్ని అలవాటు చేస్తున్నారు.

"గట్టిగా ఉంటేనే పిల్లలు సరిగా పెరుగుతారు" అనే భావన ఇంకా అనేక కుటుంబాల్లో కనిపిస్తోంది. కానీ భయంతో పెరిగిన పిల్లలు బయటకు వినయంగా కనిపించినా, లోపల మాత్రం ఆందోళన, ఒత్తిడి, అపరాధభావన, ఆత్మన్యూనతతో జీవిస్తుంటారు.

"మంచి పిల్లలు" అనే భావన పిల్లలను మౌనంగా మారుస్తోంది

**మన సమాజంలో "మంచి పిల్లలు" అంటే:**

- పెద్దల మాట ఎదిరించని పిల్లలు - ఎక్కువ ప్రశ్నలు అడగని పిల్లలు
- ఏడవని పిల్లలు - ఎప్పుడూ తప్పు చేయని పిల్లలు అనే భావన బలంగా ఉంది.

**చిన్నప్పటి నుంచి:** "అలా మాట్లాడొద్దు..." "మూసుకుని ఉండు..." "ఏడవకు..."

"ఇతరుల ముందు పరువు తీస్తావా?" అనే మాటలు వింటూ పెరిగే పిల్లలు, ఒక దశ తర్వాత తమ భావాలను బయటపెట్టడానికే భయపడతారు.

వాళ్లు నిజంగా వినయంగా మారరు... కేవలం తిరస్కరణకు భయపడే మనుషులుగా మారుతారు. శిక్షల వెనుక పెరుగుతున్న భయం తప్పు చేసినప్పుడు పిల్లలకు దారి చూపించడం అవసరం. కానీ చాలా చోట్ల అది అవమానంగా, శిక్షగా మారిపోతోంది.

**కొన్ని కుటుంబాల్లో:**

- తక్కువ మార్కులు వస్తే మాట్లాడకపోవడం - ఇతరుల ముందు తిట్టడం - పోల్చడం
- కొట్టడం - ప్రేమను తగ్గించడం ఇలాంటి పద్ధతులు కనిపిస్తున్నాయి.

**ఈ విధమైన క్రమశిక్షణ వల్ల పిల్లలు:** - నిజం చెప్పడానికి భయపడతారు

- తమ సమస్యలను దాచిపెడతారు - తప్పు అంటే జీవితాంతం గుర్తుండే అవమానమని భావిస్తారు

**ఇలా పెరిగిన పిల్లలు పెద్దయ్యాక కూడా:** - అపజయ భయం - అధిక ఆలోచనలు - నిరంతర ఆందోళన - అందరికీ నచ్చాలని తపన వంటి మానసిక భారాలతో జీవిస్తుంటారు. పోలికలు --- పిల్లల ఆత్మవిశ్వాసాన్ని మెల్లగా కూల్చే విషం

"పక్కింటి పిల్లను చూడు..."

"నీ అన్నయ్యలా ఎందుకు ఉండలేవు?"

"నీ స్నేహితుడు ఎంత బాగా చదువుతున్నాడు..."

ఇలాంటి మాటలు చాలామందికి సాధారణంగా అనిపించవచ్చు. కానీ పిల్లల మనసులో ఇవి లోతైన గాయాలు చేస్తాయి.

ప్రతి పిల్లవాడూ ఒకేలా ఉండడు.

ఒకరికున్న ప్రతిభ ఇంకొకరికి ఉండకపోవచ్చు. ఒకరు చదువులో బాగా ఉండొచ్చు... ఇంకొకరు కళల్లో, క్రీడల్లో, భావోద్వేగాలలో ప్రత్యేకత చూపొచ్చు.

పోలికలు పిల్లల ప్రతిభను వెలికి తీయవు...

వారి స్వీయగౌరవాన్ని మెల్లగా చంపేస్తాయి.

ఎప్పుడూ తప్పు చేయకూడదనే ఒత్తిడి

చాలామంది తల్లిదండ్రులు తెలియకుండానే పిల్లల్లో "ఎప్పుడూ ఉత్తమంగా ఉండాలి" అనే ఒత్తిడిని పెంచుతున్నారు.

"ఎప్పుడూ మొదటివాడివే కావాలి..."

"తప్పు చేయకూడదు..."

"అందరూ నిన్ను మెచ్చుకోవాలి..."

ఇలాంటి మాటలు పిల్లల్లో ఒక భయాన్ని పెంచుతాయి:

"నేను తప్పు చేస్తే నన్నెవరూ ప్రేమించరు."

**ఈ భావనతో పెరిగిన పిల్లలు:**

- చిన్న తప్పుకీ తీవ్రంగా బాధపడతారు - తమను తాము నిందించుకుంటారు
- ఏ పని ప్రారంభించడానికే భయపడతారు - అపజయాన్ని జీవితాంతం మోయాల్సిన గాయంగా భావిస్తారు భావోద్వేగాలను అణిచివేయడం --- మౌన గాయాలకు కారణం

"బలంగా ఉండు..." "ఏడవడం ఆపు..." "అంత సున్నితంగా ఉండొద్దు..." అంటూ పిల్లల భావోద్వేగాలను అణిచివేయడం చాలా ప్రమాదకరం. కోపం, బాధ, భయం, నిరాశ --- ఇవన్నీ సహజమైన భావోద్వేగాలు. వాటిని దాచుకోవాలని కాదు... ఎలా అర్థం చేసుకోవాలో నేర్పాలి.

**భావాలను అర్థం చేసుకోవడం నేర్చుకోని పిల్లలు, పెద్దయ్యాక:**

- సంబంధాల్లో ఇబ్బందులు - కోప నియంత్రణ లోపం - మానసిక ఆందోళనలు
- ఇతరులపై అధిక ఆధారపడటం వంటి సమస్యలను ఎదుర్కొనే అవకాశం ఎక్కువ.

అసలు క్రమశిక్షణ అంటే ఏమిటి?

**క్రమశిక్షణ అంటే:** - భయపెట్టడం కాదు - కొట్టడం కాదు - అవమానించడం కాదు

- పిల్లల మనసును విరగగొట్టడం కాదు

**అసలు క్రమశిక్షణ అంటే:** - బాధ్యత నేర్పించడం - గౌరవంగా మాట్లాడడం నేర్పించడం

- తప్పుల నుంచి నేర్చుకోవడం చూపించడం - భావోద్వేగాలను సమతుల్యం చేసుకోవడం నేర్పించడం భయంతో వచ్చిన మార్పు కొంతకాలం మాత్రమే ఉంటుంది. కానీ ప్రేమతో వచ్చిన అవగాహన జీవితాంతం నిలుస్తుంది. పిల్లలకు అత్యవసరమైనది --- భద్రతా భావన పిల్లలు సంపూర్ణమైన తల్లిదండ్రులను కోరుకోరు. తమను అర్థం చేసుకునే తల్లిదండ్రులను కోరుకుంటారు.

**వాళ్లు తప్పు చేసినప్పుడు:** "నువ్వు తప్పు చేశావు... కానీ నువ్వు చెడ్డవాడివి కాదు" అని చెప్పే భరోసా వారి జీవితాన్ని మార్చగలదు. ఎందుకంటే పిల్లలు ముందుగా నేర్చుకునేది పాఠ్యపుస్తకాల నుంచి కాదు... తల్లిదండ్రుల ప్రవర్తన నుంచి. ఇంట్లో ప్రేమ కంటే భయం ఎక్కువగా ఉంటే, పిల్లలు బయటకు వినయంగా కనిపించవచ్చు. కానీ లోపల బలమైన మనసుతో ఎదగలేరు.

**ముగింపు**

భయంతో పెరిగిన పిల్లలు చాలాసార్లు అందరికీ నచ్చే మనుషులవుతారు.

కానీ ప్రేమతో, అవగాహనతో పెరిగిన పిల్లలు తమను తాము ప్రేమించగలిగే మనుషులవుతారు. సమాజానికి మార్కులు తెచ్చే పిల్లలు మాత్రమే కాదు...

మనసును అర్థం చేసుకునే, భావోద్వేగంగా ఆరోగ్యంగా ఉండే తరం కూడా అవసరం.

క్రమశిక్షణ అంటే పిల్లల మనసును విరగగొట్టడం కాదు...

వారి వ్యక్తిత్వాన్ని ప్రేమతో నిర్మించడం.

-డాక్టర్ సునీత జువ్వా
సైకాలజిస్ట్,
హైదరాబాద్



# హనుమంత వాహనంపై శ్రీ గోవిందరాజస్వామి దివ్య విహారం

- భక్తులకు అభయప్రదానం చేసిన గోవిందుడు
- చెక్కభజనలు, కోలాటాలతో మారుమోగిన తిరుపతి వీధులు
- బ్రహ్మోత్సవాల్లో ఆధ్యాత్మిక ఉత్సాహం





**తిరుపతి,కలంకౌంటర్ :** తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజైన గురువారం ఉదయం 7 గంటలకు శ్రీ గోవిందరాజస్వామివారు హనుమంత వాహనంపై దివ్యమంగళ స్వరూపంతో భక్తులకు దర్శనమిచ్చి అభయప్రదానం చేశారు. భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ వాహనసేవ అత్యంత వైభవంగా జరిగింది. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పించి గోవింద నామస్మరణతో స్వామివారిని దర్శించుకుని పరవశించారు. త్రేతాయుగంలో శ్రీరాముడికి పరమభక్తుడిగా వెలుగొందిన హనుమంతుడు భక్తి, శక్తి, శరణాగతికి ప్రతీకగా నిలిచాడు. బుద్ధి, బలం, ధైర్యం, ఆరోగ్యం, నిర్భయత్వం, వాక్పటిమ హనుమత్స్మరణతో సిద్ధిస్తాయని పురాణాలు వివరిస్తున్నాయి. అందుకే స్వామివారు హనుమంత వాహనంపై విహరిస్తూ భక్తులకు శరణాగతి మహిమను చాటిచెప్పారు. అనంతరం ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజస్వామివారికి స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకాలు నిర్వహించి విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు వసంతోత్సవం ఘనంగా జరగనుంది. అనంతరం స్వామివారు బంగారు తిరుచ్చిపై నాలుగు మాడ వీధుల్లో విహరించనున్నారు. రాత్రి 7 గంటలకు గజవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి, టిటిడి డిప్యూటీ ఈవో శ్రీమతి వి.ఆర్. శాంతి, విజివో శ్రీ గిరిధర్, ఏఈవో శ్రీ ఏబీ నారాయణ చౌదరి, ఏవీఎవ్వో శ్రీ శ్రీనివాసరావు, అర్చకులు, అధికారులు, శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

## తెలుగు వారి గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు ఎన్ టి ఆర్" - జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్



**విజయనగరం,కలంకౌంటర్ :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాల వేసి, పుష్పాలు సమర్పించి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ - తెలుగు వారి గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు అని, తెలుగు జాతికి, తెలుగు భాషకు దేశ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన వ్యక్తి అని, వారు అందించిన సేవలు వెలకట్టలేనివని ప్రశంసించారు. తెలుగు ప్రజల జీవితాలలో పెను మార్పులు తెచ్చిన ఆధునిక సంఘ సంస్కర్త, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన కారణజన్ముడు అని అన్నారు. తన 44 ఏళ్ళ సినిమా జీవితంలో చాలా జానపద, చారిత్రిక, సాంఘిక, పౌరాణిక చిత్రాలలో నటించారని, 1968లో భారత ప్రభుత్వం నుండి పద్మశ్రీ పురస్కారం, 1978 లో ఆంధ్రా విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేటు 'కళాప్రపూర్ణ ' స్వీకరించారన్నారు. ఎన్.టి.ఆర్ క్రమశిక్షణ, పట్టుదల భావితరాలకు స్ఫూర్తిదాయక మని, వారి నైతికవిలువలను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఎన్టీఆర్ అసాధారణ జీవితం, దూరదృష్టితో కూడిన నాయకత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిపై గాఢమైన ముద్రవేసిందన్నారు. తెలుగువారి ఖ్యాతిని, తెలుగు భాష గొప్ప తనాన్ని ప్రపంచానికి చాటిన మహానేతగా ఎన్టీఆర్ నిలిచారని, ఆయన సినీ రంగానికి, రాజకీయ వేదికకు, సాధారణ ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ కొనియాడారు.

## మత సామరస్యానికి, విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన బక్రీద్ పండగ - జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్



**విజయనగరం,కలంకౌంటర్ :** జిల్లాలో బక్రీద్ పండగ హిందూ-ముస్లిం సోదరుల మధ్య సోదర భావం పెల్లుబికి, పండగలో ఎటువంటి మత విద్వేషాలు, సంఘర్షలు, అల్లర్లు జరగకుండా ప్రశాంతయుతంగా ముగిసినట్లుగా జిల్లా ఎస్పీ లిఎ.ఆర్.దామోదర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ - బక్రీద్ పర్వదినాన జిల్లాలో ఎటువంటి మత ఘర్షణలు తలెత్తకుండా జిల్లా పోలీసుశాఖ చేపట్టిన ముందస్తు భద్రత చర్యలు సత్ఫలితాలిచ్చాయని అన్నారు. బక్రీద్ పండగను దృష్టిలో పెట్టుకొని జిల్లా వ్యాప్తంగా అన్ని మసీదుల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు, భద్రత ఏర్పాట్లును సంబంధిత పోలీసు అధికారులు సిసి కెమెరాలు, డ్రోన్ లతో పర్యవేక్షించారు. మసీదుల వద్ద ప్రార్ధనలకు విచ్చేసిన ముస్లిం సోదరులకు హిందూ సోదరులు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతూ, మత సామరస్యానికి ప్రతీకగా నిలిచారన్నారు. కొన్ని మసీదుల వద్ద హిందువులు, ముస్లింలు సోదర భావంతో ఒకరినొకరు అలింగనం చేసుకొని, శుభాకాంక్షలు తెలుపుకొన్నారన్నారు. పట్టణంలో ముఖ్యమైన మసీదుల వద్ద డ్రోన్ లతో నిఘా ఏర్పాటు చేసి, ప్రార్ధనలకు వచ్చే ముస్లిం సోదరుల వాహనాల వలన ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. భారత దేశం విభిన్న సంస్కృతుల సమ్మేళనమని, బక్రీద్ పండగ రోజున హిందూ-ముస్లిం సోదరులు ఒకరి సంస్కృతిని ఒకరు గౌరవించుకొంటూ, శుభాకాంక్షలు తెలుపుకొంటూ మతసామరస్యానికి, విశ్వాసానికి ప్రతీకగా నిలిచారని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా వివిధ మసీదుల వద్ద సంబంధిత సిఐలు, ఎస్ఐలు భద్రత విధులు నిర్వహించగా, డిఎస్పీలు బందోబస్తు, భద్రత ఏర్పాట్లును పర్యవేక్షించారు.

## మహానాడు సంచలన రికార్డు సృష్టించింది: నారా లోకేశ్

**మంగళగిరి,కలంకౌంటర్ :** తొలిసారి హైబ్రిడ్ మోడల్ లో నిర్వహిస్తున్న మహానాడు సంచలన రికార్డు సృష్టించిందని టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ తెలిపారు. మహానాడు కార్యక్రమాలకు 11 లక్షల మంది క్యాడర్ హాజరయ్యారని ఆయన వెల్లడించారు. ఈ-అటెండెన్స్ లో వీరంతా నమోదు చేయించుకున్నారని తెలిపారు. మహానాడులో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ ఆయన ఈ వివరాలను వెల్లడించారు. పార్టీలో ఎప్పటికప్పుడు సంస్కరణలను తీసుకురావాల్సిన అవసరం ఉందని లోకేశ్ అన్నారు. ఎన్టీఆర్ కాలం నుంచే ఎప్పటికప్పుడు మార్పులు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. సిద్ధాంత పరంగానే తాము సంస్కరణలు తీసుకొస్తున్నామని... ఎన్నికల కోసం కాదని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఇప్పటి నుంచే మహిళా నాయకత్వాన్ని తయారు చేస్తామని వెల్లడించారు. జెన్ జీ యువత ఏం ఆశిస్తుందో ఆలోచించి దానికి అనుగుణంగా ముందుకు వెళ్లాల్సి ఉందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలకు టీడీపీ సిద్ధంగా ఉందని లోకేశ్ తెలిపారు. జగన్ మాదిరి తాము ఏకపక్షంగా ఏకగ్రీవాలు చేసుకోబోమని చెప్పారు. టీడీపీ ప్రజాస్వామ్యబద్ధంగానే ముందుకు సాగుతుందని అన్నారు. జగన్ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్ల పేపర్లను లాక్కుని ఎలాంటి అరాచకాలకు పాల్పడ్డారో అందరం చూశామని చెప్పారు. డీఎస్సీపై జగన్ వేయించిన కేసులన్నింటినీ కోర్టు కొట్టివేసిందని తెలిపారు. జగన్ తన కుటుంబ చరిత్రను తానే తవ్వి తీయించారని లోకేశ్ ఎద్దేవా చేశారు. రాజారెడ్డి అరాచకాలు, బైరైటీస్ గనుల కోసం చేసిన హత్యలు అన్నింటినీ ప్రజలకు తెలియజేసిన ఘనత జగన్ దేనని అన్నారు.





పర్చూరు నియోజకవర్గంలో మహానాడు కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అన్న ఎన్టీఆర్ జన్మదినోత్సవ వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమం లో టీడీపీ జిల్లా నాయకుడు మామిడి పాకహరి ప్రసాద్ ,పలువురు నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

-పర్చూరు,కలంకౌంటర్ :





మహానాడు కార్యక్రమాన్ని సందర్శించిన తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు తో పార్టీ నాయకులు గొంట్ల రామ్మోహనరావు తదితరులు.

-విజయవాడ,కలంకౌంటర్ :

# పంచ్ ప్రభాకర్ ను అరెస్ట్ చేయాలి

**–పెడబల్లె వికాస్, ఐ వి ఎఫ్ రాష్ట్ర యువజన విభాగం**



**విజయవాడ, కలంకౌంటర్ :** సోషల్ మీడియా వేదికను దుర్వినియోగం చేస్తూ, శాంతి భద్రతలకు భంగం కలిగిస్తూ, ఆర్యవైశ్య జాతిని కించపరిచిన పంచ్ ప్రభాకర్ పై ఒక ప్రకటనలో ఐ వి ఎఫ్ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు పెడబల్లె వికాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు.సమాజానికి ఉపయోగపడక పోగా,ఘర్షణలు సృష్టిస్తూ ,విదేశాల్లో దాక్కొని వీడియోలు చేస్తూ, ప్రభుత్వానికే సవాల్ చేస్తున్న పంచ్ ప్రభాకర్ ను అరెస్ట్ చేయకపోతే ఉద్యమం చేస్తామని స్పష్టం చేశారు.ఆర్యవైశ్యులు దేశభక్తికి ప్రతీకలని పేర్కొ న్నారు. వాసవీమాత అగ్నిప్రవేశ సమయంలో 102 గోత్రాల వైశ్యులు ప్రాణత్యాగం చేశారని,.పొట్టి శ్రీరాములు త్యాగాన్ని గుర్తు చేస్తూ, సమాజ సేవలో వైశ్యుల పాత్ర అపారమని పేర్కొన్నారు.వ్యాపారాల ద్వారా వేలాది మందికి ఉపాధి కల్పిస్తూ, ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తూ, ఆధ్యాత్మిక , సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ,సమాజాన్ని గౌరవిస్తున్న తమ జాతిని అవమానించడం దుర్మార్గం అన్నారు. పంచ్ ప్రభాకర్ ను అరెస్ట్ చేయాలని కోరారు.సామాజిక వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే లా మాట్లాడిన ఆయనపై పోలీసులు వెంటనే కేసు నమోదు చేయాలని, సంబంధిత రాజకీయ పార్టీ ఆయనను బహిష్కరించాలని కోరారు. వైశ్య సమాజం శాంతిని కోరుకుంటుందని, అయితే ఆత్మగౌర వాన్నిదెబ్బతీసే ప్రయత్నాలను సహించబోదని హెచ్చరించారు.

# పంచ్ ప్రభాకర్...దమ్ముంటే ఇండియాకి రా

- ఆర్యవైశ్యుల్ని,టీజీ వెంకటేష్ ను విమర్శించే స్థాయి నీకు లేదు
- ఆర్యవైశ్య మహాసభ గౌరవాధ్యక్షుడు,బిల్డింగ్ కమిటీ చైర్మన్ పెనుగొండ సుబ్బరాయుడు



**విజయవాడ, కలంకౌంటర్ :** చర్చకైనా,చట్టానికి లోబడి పోరాటానికి అయినా మేము సిద్ధం..నీకు దమ్ముంటే ఇండియాకి రా పంచ్ ప్రభాకర్ చూసుకుందామని ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ గౌరవాధ్యక్షుడు , మహాసభ బిల్డింగ్ కమిటీ చైర్మన్ పెనుగొండ సుబ్బారాయుడు సవాల్ విసిరారు. దేశ హితం, రాష్ట్ర హితం కోసం అన్ని వర్గాలను గౌరవిస్తూ , ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా ముందుకు వెళ్తున్న తులసి మొక్క లైన ఆర్యవైశ్యుల్ని కించపరిచే స్థాయి నీది కాదని ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ గౌరవాధ్యక్షుడు, మహాసభ బిల్డింగ్ కమిటీ చైర్మన్ పెనుగొండ సుబ్బారాయుడు స్పష్టం చేశారు. గురువారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ విదేశాల్లో కూర్చుని మాట్లాడడం కాదు. ఇండియా వచ్చి మాట్లాడితే ఆర్యవైశ్యుల తడాఖా చూపిస్తారని హితవు పలికారు.ప్రముఖ పారిశ్రామిక వేత్త, దానశీలి,సీనియర్ నాయకుడు టీజీ వెంకటేష్ ను విమర్శించే అర్హత నీకు లేదని,అన్ని వర్గాలకు ఎన్నో రకాలుగా అండగా ఉంటూ , గోసంఘం నిర్వహణ,పేద లకు సామూహిక వివాహాలు జరిపించడం,ఆర్యవైశ్యులకు అవసరమైన శాశ్వత వేదికలకు విరాళాలు ఇచ్చి ప్రోత్సహించడం, పేద విద్యార్థులకు చేయూత ఇవ్వడం...ఇలా ఎన్నో సేవలు అందిస్తూ ,అందరి అభిమానం చూరగొన్న టీజీ వెంకటేష్ దాతృత్వం సమాజానికే ఆదర్శం అన్నారు.రాష్ట్రంలో ఉన్న అన్ని ఆర్యవైశ్య సంఘాలను ఒకేవేదికమీదకు తెచ్చి , సత్రాలు అభివృద్ధి కోసం సహకరిస్తూ, ఐక్యతకోసం పాటుపడుతున్న మహానుభావుడు టీజీ వెంకటేష్ అని ,.దేశం కోసం రాష్ట్రం కోసం ప్రాణాలు త్యాగం చేసిన మహనీయులు జన్మించిన జాతిని విమర్శించడం అంటే అన్ని వర్గాలను కించపర్చినట్లే అన్నారు.ఆర్యవైశ్యులు చట్టాన్ని,సమాజాన్ని గౌరవిస్తూ నిబద్ధతగా,క్రమశిక్షణ, ధర్మ బద్ధంగా జీవనం సాగిస్తారని,చిల్లర రాజకీయాలు,పెయిడ్ ఆర్టిస్టుగా పనిచేయరని తెలిపారు. రాజకీయాల్లో కూడా ఆర్యవైశ్యులు ఉన్నత స్థానాల్లో ఉండి అందరికీ సేవలందించారని,హుందాగా వ్యవహరించి,ఎవరినీ విమర్శించిన సందర్భాలే లేవన్నారు.ఆర్యవైశ్యులను రాజకీయంగా, వ్యాపార పరంగా,ఎన్నో రకాలుగా ఇబ్బందులు పెట్టినా ఎవరినీ తక్కువగా మాట్లాడలేదని, చరిత్ర తెలుసుకుని మాట్లాడితే గౌరవంగా ఉంటుందన్నారు. సమాజంలో అందరినీ గౌరవించే స్వభావం ఆర్యవైశ్యుల్లో ఉంది కాబట్టే మాకు అన్ని వర్గాలు అండగా నిలుస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం పంచ్ ప్రభాకర్ ను తక్షణమే అరెస్ట్ చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, బిల్డింగ్ కమిటీ చైర్మన్ పెనుగొండ సుబ్బారాయుడు విజ్ఞప్తి చేశారు .లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని అన్నారు.

# క్లీన్ స్వీప్ కార్యక్రమం లో బండి



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో పాల్గొన్న డి సి ఎం ఎస్ చైర్మన్ బండి రామకృష్ణ మాట్లాడుతూ క్లీన్ స్వీప్ లో భాగంగా 8.వ డివిజన్ ఆర్టీసీ కాలనీలో కర్రీ మహేష్ ఆధ్వర్యంలో రెండు కిలోమీటర్ల మేర క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని నిర్వహించామని అన్నారు .కూటమి ప్రభుత్వం పట్టణాలను చెత్త రహితంగా, పరిశుభ్రంగా మార్చుడానికి చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమమే 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' అన్నారు .ఈ కార్యక్రమం ముఖ్యమైన ఉద్దేశం చెత్త ప్రాంతాల తొలగింపు.నగరాలు , పట్టణాలలో పేరుకుపోయిన చెత్త కుప్పలు పూర్తిగా తొలగించడం.డ్రైనేజీల శుభ్రత: వర్షపు నీరు నిల్వ ఉండకుండా మురుగునీటి కాలువలు, నాలాలు మరియు బ్యాక్ లేన్లను శుభ్రపరచడం.ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ పబ్లిక్ టాయిలెట్లను పరిశుభ్రంగా ఉంచడం.తడి-పొడి చెత్త విభజన: ఇళ్లల్లో, వాణిజ్య సముదాయాల్లో చెత్తను వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించి, శాస్త్రీయమైన ఘన వ్యర్థాల నిర్వహణను ప్రోత్సహించడం అన్నారు. రాష్ట్రంలోని మొత్తం 123 అర్బన్ లోకల్ బాడీస్ (మున్సిపాలిటీలు/కార్పొరేషన్లు), సహా మచిలీపట్నం పరిధిలో కూడా ఈ నాలుగు వారాల ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ కొనసాగుతోందని పరిశుభ్రత అనేది కేవలం మున్సిపాలిటీ బాధ్యతే కాకుండా, పౌరులందరి నిత్య జీవితంలో భాగం కావాలనే లక్ష్యంతో ప్రభుత్వం దీన్ని చేపట్టిందని రామకృష్ణ పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గడ్డంరాజు, కొట్టే వెంకట్రావు,తోటభాస్కర్, శాయన శివయ్య,సనకా భాస్కర్ రావు, త్రిపురారి తరుణ్,సోమిశెట్టిగోపాలకృష్ణ, కర్రీ ప్రకాష్, కర్రీ శ్యామ్, బచ్చు వెంకన్న బాబు,పట్నాలచంటి జనసేన పార్టీ నాయకులు సైనికులు 8.వ డివిజన్ ప్రజలు ఆర్టీసీ కాలనీవాసులు పాల్గొన్నారు.

# కార్యకర్తల ఆనందోత్సాహాల మధ్య రెండో రోజు మహానాడు



**బంటుమిల్లి,కలంకౌంటర్ :** పెడననియోజకవర్గంలోనిబంటుమిల్లి మండలం లో మహానాడు కార్యక్రమాలు రెండో రోజు గురువారం కార్యకర్తల నాయకుల ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగినాయి. కార్యక్రమంలో భాగంగా పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ స్వగ్రామం నాగేశ్వరావుపేట నుండి బంటుమిల్లి లో విజయలక్ష్మి కన్వెన్షన్ హాల్లో మహానాడు వేదిక వరకు సైకిల్ పై బయలుదేరి కార్యకర్తలను కలిసి వారి అభినందనలు తీసుకున్న ఎమ్మెల్యే కాగిత పెడన నియోజకవర్గంలో 8, 9, 10 క్లస్టర్ లలో జరుగుతున్నా మహానాడులో తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన మహోన్నత నాయకుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు గారి 103వ జయంతి వేడుకలలో తెలుగుదేశం పార్టీ నేతలతో మరియు పెడన నియోజకవర్గం పరిశీలకులు షేక్ ఆషా తో కలిసి పాల్గొన్నారు కార్యక్రమంలో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ గారు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసి స్వర్గీయ ఎన్టీ రామారావు కు ఘన నివాళులర్పించారు.. తెలుగుదేశం పార్టీ వర్చువల్ మహానాడు పెడన నియోజకవర్గంలో 10 మహానాడు వేదికలను స్వయంగా సందర్శించి, ఏర్పాట్లను ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ పరిశీలించారు. కార్యకర్తలతో ఆత్మీయంగా మాట్లాడి వారిలో మరింత ఉత్సాహం నింపారు. పలుచోట్ల పార్టీ శ్రేణులు నృత్యాలతో సందడి చేస్తూ పసుపు పండుగ మహానాడును ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, "బలమైన పునాదులతో తెలుగుదేశం పార్టీని స్థాపించి రాష్ట్ర దశదిశను మార్చిన మహానాయకుడు ఎన్టీఆర్. అన్నారు. బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించి వారి అభ్యున్నతికి ఎనలేని సేవలు అందించారు" అని కొనియాడారు "రాష్ట్ర రాజకీయాల్లో సంస్కరణలకు శ్రీకారం చుట్టిన యుగపురుషుడు ఎన్టీఆర్. తెలుగు ప్రజల గౌరవాన్ని జాతీయ స్థాయిలో నిలబెట్టిన మహామనిషి. అలాంటి మహానేత జయంతి వేడుకల్లో పాల్గొని నివాళులర్పించడం మనకు ఎంతో గర్వకారణం అని ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ గారు పేర్కొన్నారు.

# కార్యకర్తలే పార్టీకి కంచుకోట





**ఉయ్యూరు,కలంకౌంటర్ :** పార్టీ కష్టకాలంలో కూడా చెక్కుచెదరకుండా నిలబడిన కార్యకర్తలే తెలుగుదేశం పార్టీ కంచుకోట వంటి వారిని పెనమలూరు శాసనసభ్యులు బోడె ప్రసాద్ అన్నారు. స్థానిక కాపు వీధిలో కళ్యాణ మండపంలో గురువారం రెండవ రోజు మహానాడు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యకర్తలు లేనిదే పార్టీ మనుగడ కష్టసాధ్యమని, వారికి ఏ కష్టం వచ్చినా కుటుంబ సభ్యుల అక్కున చేర్చుకుని కాపాడుకుంటామని అన్నారు. ఈ సంవత్సర కాలంలో మృతి చెందిన పట్టణంలోని సీనియర్ కార్యకర్తలను ఆయన గుర్తు చేసుకున్నారు. వ్యక్తులు వస్తూ ఉంటారు పోతూ ఉంటారని పార్టీ చిరస్థాయిగా నిలబడుతుందని దానికి కారణం కార్యకర్తలేనని అన్నారు. ఈ సందర్భంగా సీనియర్ కార్యకర్తలను ఘనంగా సన్మానించారు. అంతకుముందు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఆయన జయంతిని పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కూనపరెడ్డి వాసు జంపాన గురునాథరావు చెక్క వెంకటసుబ్బారావు వెంట్రప్రగడ వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు..


కలంకౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

కలంకౌంటర్ దినపత్రిక లో యాడ్స్ కోసం సంప్రదించండి..

సెల్ : 9346935672


# మజ్జిగ పంపిణీ



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం క్లాత్ బజార్ నందు వాసవి క్లబ్, వాసవి క్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రంలో ఇంటర్నేషనల్ ఫాస్ట్ ప్రెసిడెంట్ వేముల హజరత్తయ్య గుప్త మజ్జిగ పంపిణీ కార్యక్రమం లో పాల్గొన్నారు.అనంతరం ఘనంగా సన్మానించారు .ఈ కార్యక్రమంలో ఐ పి సి వేముల శిరీష, ఆర్ సి అన్నం అశోక్, ఆర్ఎస్ టి.రంగనాయకులు, డిపిఓ వీ.కే.ఎన్ మూర్తి,జయవరపు.ప్రసాద్, రాము, ఏ నటరాజ్,ఆర్. పూర్ణ షామిలి, కే.ప్రసాద్.వి.శ్రీను , వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



# ఘన సన్మానం





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** విదేశీ పర్యటనను ముగించుకుని స్వదేశానికి తిరిగి వచ్చిన రాధా రంగా మిత్రమండలి తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు బుల్లెట్ ధర్మారావు కి ఘన స్వాగతం పలికిన రాధా రంగా మిత్రమండలి సభ్యులు, కూటమి నాయకులు.అనంతరం ఘనంగా సన్మానించారు.

# ఆధునికత, ఆధ్యాత్మికత కలయికే లక్ష్యం: మహానాడులో మంత్రి ఆనం

- మహానాడులో 'ఆనంద ఆంధ్రప్రదేశ్'పై ప్రత్యేక తీర్మానం
- ఆధునికత, ఆధ్యాత్మికత కలయికే ప్రభుత్వ లక్ష్యమన్న మంత్రి ఆనం
- అభివృద్ధి అంటే ధర్మంతో కూడిన సమృద్ధి అని వ్యాఖ్య
- సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు
- ఏఐ, డిజిటల్ గవర్నెన్స్‌తో భవిష్యత్ నిర్మాణం అని స్పష్టీకరణ



**మంగళగిరి,కలంకౌంటర్ :** తెలుగుదేశం పార్టీ మహానాడు-2026 రెండో రోజు ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా 'ఆధునిక, ఆధ్యాత్మిక, ఆనంద ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై ప్రవేశపెట్టిన తీర్మానంపై మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రసంగించారు. రాష్ట్రం ఆధునికత వైపు పరుగులు తీస్తూనే, ప్రతి కుటుంబం ఆధ్యాత్మికతలోని ఆనందాన్ని అనుభవించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్ష అని ఆయన అన్నారు. అభివృద్ధి అంటే కేవలం సంపద సృష్టించడం కాదని, ధర్మంతో కూడిన సమృద్ధి, శక్తితో కూడిన శాంతిని సాధించడమని వివరించారు. ప్రస్తుత ప్రపంచం సాంకేతిక విప్లవంతో వేగంగా మారుతోందని, ఏఐ, డిజిటల్ గవర్నెన్స్, గ్లోబల్ మార్కెట్లు మన భవిష్యత్తును నిర్దేశిస్తున్నాయని ఆనం పేర్కొన్నారు. కేవలం ఆర్థిక ప్రగతిపైనే దృష్టి పెడితే సమాజం యంత్రంలా మారుతుందని, అదే సమయంలో కేవలం ఆధ్యాత్మికతే లక్ష్యమైతే ప్రపంచ పోటీలో వెనుకబడిపోతామని హెచ్చరించారు. ఈ రెండిటినీ సమన్వయం చేస్తూ ఆనంద ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించడం ఒక దార్శనిక యజ్ఞమని అభివర్ణించారు. వేదాలు చెప్పిన 'సత్యమేవ జయతే' సూత్రాన్ని అనుసరించి పరిపాలనలో పారదర్శకత, రాజకీయాల్లో నైతికత ఉండాలని సీఎం చంద్రబాబు భావిస్తున్నారని తెలిపారు. ఆయన సారథ్యంలో, యువ నాయకులు నారా లోకేశ్ సహకారంతో రాష్ట్ర భవిష్యత్ తరాలకు మంచి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మతసామరస్యం, సామాజిక న్యాయం, మహిళా సాధికారత, రైతు సంక్షేమం వంటి అంశాలకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com